క్లుప్తంగా...

ఎంపీని కలిసిన కమిషనర్



మణికొండ: నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేందర్‌రెడ్డి శనివారం చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నార్సింగి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎక్కువ సమయం అందుబాటులో ఉండి వారి సమస్యలను నివారించాలని కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్లు జి.శివారెడ్డి, పి.ప్రవీణ్‌కుమార్, నాయకులు గోపాల గణేష్‌లు పాల్గొన్నారు.

నేడు సామూహిక వివాహాలు

రాజేంద్రనగర్: మైనారిటీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వివాహ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హసన్‌నగర్ నూరానీ మసీద్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 13 నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఈ వివాహాలు జరిపిస్తున్నామని తెలిపారు.

ఆస్కార్ లిఫ్ట్ సంస్థ యజమానిపై ఫిర్యాదు

మణికొండ: తన ఆసుపత్రిలో లిఫ్టు ఏర్పాటు చేస్తానని డబ్బు తీసుకొని ఆలస్యంగా ఏర్పాటు చేయడం, అది కూడా నాణ్యతగా లేకపోవటంతో ఓ డాక్టర్ సదరు సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం...మణికొండ మున్సిపాలిటీ, లక్ష్మీప్రియనగర్ కాలనీలో డాక్టర్ ప్రభు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని డాక్టర్ ప్రభుకుమార్ ఏర్పాటు చేశారు. దానికి అవసరమైన లిఫ్టును ఏర్పాటు చేసేందుకు స్థానిక ఆస్కార్ లిఫ్టుల సంస్థ యజమాని అమర్‌నాథ్‌తో ఆరునెలల క్రితం రూ. 11.36లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. 90శాతం డబ్బు తీసుకున్నా సకాలంలో లిఫ్టు ఏర్పాటు చేయకపోవటం, చేశాక నాణ్యత లేకుండా ఏర్పాటు చేయటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వచ్చి సరి చేయాలని కోరినా పట్టించుకోకపోవటంతో శనివారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లిఫ్టు సంస్థ యజమాని పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

నేడు ఏబీవీపీ పతాకావిష్కరణ

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్ తెలిపారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద ఉదయం 10 గంటలకు పతాకావిష్కరణ చేస్తామని అనంతరం మొక్కలు నాటతామని వివరించారు.

నూతన పోకడలకు అనుగుణంగా శిక్షణ అవసరం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో డైరెక్టర్ డా.రామేశ్వరరావు తదితరులు

రాయదుర్గం: వ్యవస్థలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం కొత్త పోకడలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ శిక్షణ అవసరమని ,దీని ద్వారా ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించవచ్చని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఈఎండీ అండ్ సీటీఈ గ్రూప్-ఏ ఆఫీసర్స్ ఆఫ్ మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ బ్యాచ్ కోసం ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం 20 రోజుల పాటు సాగుతుంది. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం నీటి సరఫరా, వినియోగం, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ టెక్నాలజీస్, వాటర్ హార్వెస్టింగ్, నీరు, శానిటేషన్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల వినియోగం వంటి అంశాలు, విద్యుత్ పరికరాలు ట్రాన్స్‌ఫార్మర్లు, భద్రతా చర్యలు, నిర్మాణాలు, రోడ్లు, ప్రణాళిక డిజైన్, నిర్మాణం, ప్రత్యేక నిర్మాణ పద్ధతిపై కేస్ స్టడీస్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

మరపురాని మహానేత వైఎస్సార్



మైలార్‌దేవ్‌పల్లిలో వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నివాళులర్పిస్తున్న పద్మారావు తదితరులు



శివరాంపల్లిలో వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మణికొండ: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వాలు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాల రోడ్ మ్యాప్‌ను వేసి ఇప్పటి ప్రభుత్వాలు అమలు చేయక తప్పని పరిస్థితిని కల్పించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో మరపురాని నాయకుడిలా నిలిచిపోయారని మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ కౌన్సిలర్ బి. పద్మారావు అన్నారు. శనివారం ఆయన 74వ జయంతిని పురస్కరించుకుని వార్డు పరిధిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజల శ్రేయస్సు, ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన ముఖ్యమంత్రిగా ఆయన చిరస్థాయిగా ప్రజల మదిలో ఉంటారన్నారు. ఆయన పథకాలతో లక్షలాది మంది లబ్ధి పొంది ఇప్పటికీ వాటిని అందుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనేక పథకాలు సామాన్య ప్రజలకు అందే విధంగా కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి డాక్టర్ వైఎస్ఆర్ అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్, పీసీసీ మాజీ కార్యదర్శి సానం శ్రీనివాస్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.ధనుంజయ్‌రెడ్డి, యువ నాయకులు వీర్లపల్లి సతీష్, డివిజన్ నాయకులు ఓంప్రకాష్, సహదేవ్, బబ్లుముదిరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లిలో...

వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో శివరాంపల్లిలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం పార్టీ యూత్ విభాగం అధ్యక్షులు సదాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తాపూర్: పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం కల్పించుకున్న మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు అబ్దేశి సదాలక్ష్మి అన్నారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఇంటిపన్నుల పద్ధతి మార్చండి

ఎంపీని కోరిన మణికొండ వాసులు

మణికొండ: క్యాపిటల్ వ్యాల్యూపై ఇంటి పన్నులను మదింపు చేస్తుండటంతో వేలాది రూపాయలు వస్తుందని, ఆ పద్ధతిని మార్చి జీహెచ్‌ఎంసీలో మాదిరిగా రెంటల్ వ్యాల్యూపైన వేసే పద్ధతిలోకి మార్చాలని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ రెసిడెంట్స్ అసోసియేషన్స్ ఫెడరేషన్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన ఇంటిలో సమావేశమై ఆయనతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పందెన్‌వాగుకు బాక్స్ డ్రైన్ నెక్నాంపూర్ చెరువు వరకు నిర్మిస్తే పక్కన నివసించే వారికి దుర్వాసన బాధ తప్పుతుందన్నారు. పలు చోట్ల ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో ఫ్రెండ్స్ కాలనీ నుంచి గీతాంజలి స్కూల్ వరకు, భాగ్యలక్ష్మి కాలనీ నుంచి ల్యాంకోహిల్స్ వరకు ప్రభుత్వం రోడ్లు వెడల్పు చేసేందుకు రూ. 60కోట్ల నిధులను కేటాయించిందన్నారు. నిధులు విడుదల కాకపోవటం, పనులు ప్రారంభం కాకపోవటంతో ప్రజలు తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. వెంటనే నిధులను విడుదల చేయించి పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, మణికొండ మున్సిపాలిటీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, పలు కాలనీ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.



చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన మణికొండ ఆల్‌కాలనీస్ నాయకులు

కార్మికులకు కనీస సౌకర్యాలు కరువు

మణికొండ: కోట్లాది రూపాయల నిధులు ఉన్న నార్సింగి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మైలారం ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో చైర్‌పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆమె వార్డులో కార్మికులు చెత్త తరలించేందుకు రిక్షాలు సైతం లేవన్నారు. దాంతో వారు బస్తాలలో చెత్తను మోయాల్సి వస్తుందన్నారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని చట్టాలు చెపుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఇకనైనా వారికి సౌకర్యాలు కల్పించాలని, లేదంటే రాబోయే రోజుల్లో వారికి అండగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు దర్నా చేస్తామన్నారు.



రిక్షా లేకపోవటంతో సంచిలో చెత్తను తీసుకెల్తున్న కార్మికులు

రెస్టారెంట్‌ను ప్రారంభించిన హోంమంత్రి

గచ్చిబౌలి: నగరంలో ఆల్ టాజా రెస్టారెంట్లను హోంమంత్రి మహ్మద్ మహముూద్ అలీ శనివారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. గచ్చిబౌలి, కొండాపూర్, ఆసిఫ్‌నగర్‌లలో ఆల్ టాజా రెస్టారెంట్‌లు అందుబాటులోకి వచ్చాయి. చికెన్, షావర్మ, శాండ్‌విచ్, జ్యూస్‌లు, బర్గర్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సమాజ నిర్మాణంలో శిశు మందిరాల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న శిశుమందిరాల ప్రధానాచార్యులు, కార్యదర్శులు

బండ్లగూడ: శ్రీ సరస్వతీ శిశు మందిరాలు తెలంగాణ రాష్ట్రస్థాయి ప్రధానాచార్యులు, కార్యదర్శుల సమావేశం శనివారం జరిగింది. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సరస్వతీ విద్యాపీఠంలో విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారాలను నేర్పించడం, వ్యక్తిత్వ వికాసం నిర్మాణం, జీవన విలువలు అందించడంలో చిన్నప్పటి నుండి శిశు మందిరాలు సమగ్ర వికాసం కలిగే విధంగా నేర్పించాలన్నారు. దీనిని నేర్పించే ఆచార్యులు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూ కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. శిశు మందిరాలలో ఆచార్య, ప్రధానాచార్య వృత్తి అత్యంత శ్రేష్టమైందన్నారు. శిశు మందిరాలు సమాజానికి ప్రేరణ కావాలని, సమాజానికి దూరంగా ఉన్న వారిని కూడా విద్య, మనదైన సంస్కారములు అందించాలన్నారు. ఆ లక్ష్యంతో శిశు మందిరాలు తమ సమీపంలో ఉన్న బలహీన బస్తీని దత్తత తీసుకోని, ఆ బస్తీలలో విద్యను, సంస్కారములను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వినయ్ అగార్వల్, శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, విద్యా భారతీ దక్షిణ మధ్యక్షేత్ర సహకార్యదర్శి వాసిరెడ్డి వినోద్‌కుమార్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అకాడామిక్ ఇంచార్జీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్రశర్మ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శిశు మందిరాల ప్రధానాచార్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేకు శుభాకాంక్షలు



చార్మినార్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియామకం చేయాలని కొలిజియం సిఫార్సు చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హైకోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది మంచర్ల విష్ణువర్ధన్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విష్ణు మాట్లాడుతూ.. హైకో ర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చేసిన సేవలను కొనియాడారు. పేదలకు సత్వర న్యాయం అందించేందుకు ఆయన కృషి చేశారన్నారు.

ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లావణ్యనరేష్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంట్లో మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యతను నెరవేర్చాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్ అన్నారు. ఆమె శనివారం తన వార్డు కమ్యూనిటీ హాల్ వద్ద ప్రజలకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జనాభాకు అనుగుణంగా సాధ్యమైనన్ని ఎక్కువ మొక్కలు ఉంటేనే మనందరికీ మంచి ఆక్సిజన్ అంది ఆరోగ్యంగా ఉంటామన్నారు. అందుకు మున్సిపాలిటీ తరపున ప్రతి వార్డులో మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, వాటిని తీసుకుని సాధ్యమైనన్ని ఎక్కువగా ఇంటి ఆవరణలో నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వాలి

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



ఆర్జేఈవైఎస్ సంస్థ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న జయేష్‌రంజన్

రాయదుర్గం: స్టార్టప్‌లు కొత్త దృక్పథాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కారానికి ఖచ్చితమైన విధానాలని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఆర్జేస్ ఇన్ఫినిటీ సొల్యూషన్స్ రెండో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఉద్యోగాల కల్పన ఆర్థిక వృద్ధికి స్టార్టప్‌లు చోదకాలుగా పనిచేస్తాయన్నారు. ప్రభుత్వాలు, పారిశ్రామిక దిగ్గజాలు, సమాజం స్టార్టప్‌ల అపార సామర్థ్యాన్ని గుర్తించి మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. 'రన్ ఫర్ ది సక్సెస్' అనే ఆర్జేఈవైఎస్ కార్నివాల్ ట్యాగ్ లైన్ ఎంతగానో ఆకట్టుకుందన్నారు.

సంకల్ప సభకు తరలిన బీజేపీ నాయకులు



సంకల్ప మహా సభలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పేదలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.శ్రీధర్ వెల్లడించారు. వరంగల్‌లో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న సభలో నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి మోండ్ర కొమురయ్య, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, దళిత మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ అభివృద్ధికి కృషి



ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గానికి సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బోజగుట్టకు చెందిన లాల్ బహదూర్‌నగర్, ఆళ్లగడ్డ, వివేకానందనగర్, సాయినగర్‌లకు చెందిన పలువురు శనివారం ఆయనను టోలిచౌకిలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. తమ బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎవ్వరికి చెప్పుకున్నా కూడా పట్టించుకోవడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్లపై పారుతున్న మురికినీటితో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందిస్తూ ఎమ్మెల్యే కార్వాన్ నియోజకవర్గంలో 292 కోట్ల రూపాయలతో సీవరేజ్ లైన్ వేయడం జరుగుతుందని, ఈ పనులు పూర్తయితే ఎక్కడా కూడా డ్రైనేజీ పొంగిపొర్లే సమస్య ఉండదని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్‌లోని బస్తీలలో సైతం సీవరేజ్ లైన్ల ఆధునీకరణ కోసం నిధులు కేటాయిస్తానని ఆయన అన్నారు.

బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు



బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయం బోనాల జాతర ఉత్సవాల బ్రోచర్‌ను శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ఆలయ కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఎస్.ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శులు అల్లి మధుసూదన గిరి, సుమన్‌కుమార్ ముదిరాజ్, కోశాధికారి బొడ్డు సాయిబాబా పాల్గొన్నారు.